క్లుప్తంగా

శ్రమిస్తే విజయం మీ సొంతం

• మున్సిపల్ కమిషనర్ లావణ్య



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ లావణ్య

సిరిసిల్లకల్చరల్: పట్టుదలతో శ్రమిస్తే ప్రతి రంగంలోనూ విజయం సొంతమవుతుందని మున్సిపల్ కమిషనర్ లావణ్య అన్నారు. శనివారం మహతి మహిళా డిగ్రీ కళాశాలలో ఫైనలియర్ విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగాల సాధనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వార్షిక పరీక్షలు పూర్తయిన వెంటనే విద్యార్థులు ప్రతిరోజునూ సద్వినియోగం చేసుకోవాలన్నారను. సమయపాలనతో పాటు లక్ష్య సాధనకు అవసరమైన అన్ని మార్గాలను అన్వేషించాలన్నారు. రానున్న రోజుల్లో పలుశాఖల్లో ఉద్యోగాల కల్పనకు ప్రకటనలు రానున్న నేపథ్యంలో విద్యార్థులు ఇప్పటినుంచే లక్ష్య సాధనకు శ్రమించాలన్నారు. కళాశాల అధ్యాపకులు రాజేందర్, డి. లక్ష్మి, దామెర స్వామి, చిటికెన వేణుగోపాల్, నాగుల శరత్‌కుమార్, లావణ్య, కళాశాల నిర్వాహకులు డాక్టర్ పి. రాజు, ఫౌండర్ ప్రిన్సి పాల్ భూమేశ్, విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాలలో నిర్వహించిన ట్రెడిషనల్ డే ఉత్సవం అలరించింది. సంప్రదాయ దుస్తుల్లో హాజరైన విద్యార్థినుల వేషధారణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

'పల్లా రాజేశ్వర్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకోవాలి'

ఎల్లారెడ్డిపేట: కాంగ్రెస్ పార్టీలో చేరినవారిని ప్రజలే చెప్పులతో కొడతారని నీతులు చెబుతున్న బీఆర్ఎస్ నాయకుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని ఆ పార్టీ సీనియర్ నాయకుడు, సింగిల్‌విండో వైస్ చైర్మన్ బుగ్గ కృష్ణమూర్తిశర్మ అన్నారు. శనివారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌లో చేరిన వారిని ప్రజలే చెప్పుతో కొడతారని పల్లా రాజేశ్వర్‌రెడ్డి పేర్కొనడం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో టీడీపీని విలీనం చేసినప్పుడు చెప్పులు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీలో ఆపరేషన్ ఆకర్ష్ పేరుతో మభ్యపెట్టి నాయకులను చేర్చుకున్నారని మండిపడ్డారు. పార్లమెంట్ ఎన్నికల్లో 14 సీట్లు కైవసం చేసుకుంటామన్నారు.

వడగళ్ల వానలు కురవొద్దని..

• రావిచెట్టు ఆంజనేయస్వామికి ముడుపు



ఆంజనేయస్వామికి ముడుపుకట్టిన రైతులు

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం రాలకుండా వడగళ్ల వాన కురవద్దని కోరుతూ మండలకేంద్రంలోని రావిచెట్టు శ్రీ ఆంజనేయస్వామికి శనివారం ముడుపుకట్టారు. ఏటా ఈ సీజన్‌లో రైతులు ముడుపు కడితే వడగళ్ల వానలు పడవనేది రైతుల నమ్మకం. పంటలు చేతికి రాగానే ముడుపు విప్పనున్నట్లు రైతులు తెలిపారు. ముడుపుకట్టిన ప్రతిసారి రాళ్లవానలు పడలేదని, ఈ సీజన్‌లో కూడా వర్షాలు పడవద్దని ముడుపుకట్టినట్లు తెలిపారు. రెడ్డి సంఘం మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, రైతులు పారిపల్లి రాంరెడ్డి, యమగొండ కిష్టారెడ్డి, సద్ది నర్సింహారెడ్డి, రాగుల ఎల్లారెడ్డి, గన్న కరుణాకర్‌రెడ్డి, బంధారపు గంగారెడ్డి, రాగుల రాజు, తిరుపతిరెడ్డి, కిషన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జ్యుడీషియల్ కస్టడీకి ముగ్గురు

వేములవాడ: వేములవాడ పోలీస్‌స్టేషన్ నుంచి ఒక్కరిని జ్యుడీషియల్ కస్టడీకి తరలించినట్లు టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు. న్యూ అర్బన్‌కాలనీకి చెందిన అన్నల్‌దాస్ శ్రీనివాస్ అదే కాలనీకి చెందిన బూర దీపను మూడేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కూతుళ్లు. రెండేళ్లుగా శ్రీనివాస్ తన భార్య దీపను వేధిస్తున్నాడు. ఈనెల 17న మద్యంమత్తులో భార్యపై బీరుసీసాతో దాడిచేశాడు. అడ్డు వచ్చిన దీప తల్లిపై దాడిచేసి పారిపోయాడు. 18న బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. శనివారం శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకు ని, జ్యుడీషియల్ కస్టడీకి తరలించినట్లు తెలిపారు.

చోరీ కేసులో మరో ఇద్దరిని..

పెద్దపల్లి జిల్లా హనుమంతునిపేటకు చెందిన దండాపాణి అనిల్, కాల్వశ్రీరాంపూర్ మండలానికి చెందిన రావర్ల రాజమల్లు ఈనెల 21న వేములవాడ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆరెపల్లి హనుమాన్ ఆలయంలో చోరీకి పాల్పడ్డారు. 7 గ్రాముల బంగారు పుస్తెలు, 6 గ్రాముల వెండిమట్టెలు, రూ.వెయ్యి ఎత్తుకెళ్లినట్లు సీఐ కరుణాకర్ తెలిపారు. శనివారం ఆరెపల్లి వద్ద అదుపులోకి తీసుకుని, వారి నుంచి ఆభరణాలను స్వాధీనం చేసుకొని జ్యుడీషియల్ కస్టడీకి తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సిరిసిల్లటౌన్: విద్యుత్ మరమ్మతుల కారణంగా ఆదివారం సిరిసిల్లలోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెస్ ఎండీ సురేందర్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలి పారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12వరకు నెహ్రూనగర్, వెంకట్రావునగర్, సు భాష్‌నగర్, గోపాల్‌నగర్, గణేశ్‌నగర్, బీవైనగర్, శివనగర్, సాయినగర్, కొత్త బస్టాండ్, ఇంది రానగర్‌లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

రోల్డ్ గోల్డ్ జిగేల్









• లేటెస్ట్ ఫ్యాషన్‌గా ఇమిటేషన్ నగలు
• ధర తక్కువ..డిజైన్లు ఎక్కువ
• కొనుగోలుపై మగువల ఆసక్తి
• సామాన్యులకు నిరంతర ఉపాధి

సిరిసిల్లటౌన్: అలంకరణకు ప్రాధాన్యం ఇచ్చే మగువలు.. తక్కువ ధరతో ఎక్కువ నగిషీలను పంచే ఇమిటేషన్ జువెల్లరీ కోరుకుంటున్నారు. గతంలో అతివలు బంగారు నగలు కోరుకునేవారు. కానీ ఇప్పటి ఫ్యాషన్ యుగంలో రోల్డ్ గోల్డ్‌కు క్రేజ్ పెరిగింది. దీంతో మార్కెట్‌ను మొత్తంగా వన్‌గ్రాం గోల్డ్ నగలు ముంచేసింది. అసలు బంగారానికి దీటుగా మగువల మనస్సు దోచుకుంటున్న ఇమిటేషన్ జ్యు'వెల్'రీపై సండే స్పెషల్..

సండే స్పెషల్

మోడ్రన్..మోడల్స్

లేటెస్ట్ ఫ్యాషన్‌తో రోల్డ్‌గోల్డ్ ఆభరణాలు మార్కెట్లో మోడ్రన్ మోడల్స్‌లో కట్టిపడేస్తున్నాయి. ఇమిటేషన్ జువెల్లరీలో వంకి, వడ్డాణాలు, పాపిటబిళ్ల, నెక్లెస్, టెంపుల్ డిజైన్లు, సీజడ్స్, గాజులు, స్టోన్ బ్యాంగిల్స్, ముత్యాలపేర్లు, జడబిళ్లలు, మాటీలు, కంకణాలు, చెంపస్వరాలు, బ్రాస్‌లెట్స్, పార్టీవేర్ బ్యాంగిల్స్ ఉన్నాయి. ఇందులో సాధారణ జువెల్లరీతోపాటు ఒక్క గ్రాం గోల్డ్ నగలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం ఫ్యాషన్‌కు అనుగుణంగా వేలాది రకాల్లో డిజైన్లలో గిల్టు నగలు మార్కెట్‌లో సందడి చేస్తున్నాయి.

జోరుగా వ్యాపారం..

మహిళలు ఇమిటేషన్ నగలు కోరుతుండటంతో సిరిసిల్లలో ఇమిటేషన్ షాపుల్లో వ్యాపారం జోరుగా సాగుతోంది. అసలు బంగారాన్ని మరిపిస్తూ..తయారైన ఈ నగలు అందంగా ఉండటమే కాకుండా..దొంగల బారినుంచి రక్షణ ఉండటంతో సామాన్యులు నుంచి ధనవంతులు సైతం వీటిని ఇష్టపడుతున్నారు. ధర తక్కువ ఉన్న ఈ నగలకు ఆరునెలల గ్యారంటీతో దొరుకుతున్నాయి. పెళ్లిళ్లకు రెడీమేడ్ సెట్లు అందుబాటులో ఉండటమే కాకుండా అద్దె ప్రాతిపదికన దొరుకుతుండటంతో ఇమిటేషన్ జువెల్లరీ అందరినీ ఆకట్టుకుంటోంది. దీంతో పట్టణంలో ఇమిటేషన్ జువెల్లరీ దుకాణాల ద్వారా సామాన్యులు నిరంతరం ఉపాధి పొందుతున్నారు.

పెళ్లి సెట్లకు డిమాండ్



పెళ్లి పేరంటాలకు ఇమిటేషన్ ప్రత్యేక నగల సెట్లకు డిమాండ్ పెరిగింది. దీంతో కొందరు ఇమిటేషన్ జువెల్లరీని రోజువారీగా అద్దెకు ఇస్తున్నారు. ప్రస్తుతం సిరిసిల్లలో ఈ దుకాణాలు విమల్ థియేటర్, గాంధీచౌక్, మార్కెట్ ఏరియా, పెద్దబజార్, పాతబస్టాండ్, కొత్త బస్టాండ్ ప్రాంతాల్లో ఇమిటేషన్ జువెల్లరీ దుకాణాలు విరివిగా వెలిశాయి. పెళ్లిల్లు, వివిధ ఫంక్షన్లకు, పార్టీలకు ప్రత్యేకంగా వన్‌గ్రాం గోల్డ్‌నగలు రావడంతో అన్నివర్గాల వారికి అనుకూలంగా మారింది. ఒక్కోరోజు మోడల్‌ను బట్టి ధర నిర్ణయిస్తూ అద్దెకు ఇస్తున్నారు.

వేలాది డిజైన్లలో



ట్రెండ్‌కు తగ్గట్లుగా వేలాది డిజైన్లలో ఇమిటేషన్ నగలు మార్కెట్‌లో లభిస్తున్నాయి. చూసేందుకు క్రేజీ ఉండటంతో డిమాండ్ పెరిగింది. హైదరాబాద్, కరీంనగర్, వరంగల్ సిటీల్లో మాదిరిగా సిరిసిల్లలో అందమైన డిజైన్లలో ఇమిటేషన్ నగలు దొరుకుతున్నాయి.

– రసజ్ఞ, డిగ్రీ విద్యార్థిని

ఇక్కడే కొంటున్నాం



వివిధ బ్రాండ్లతో పిలిచే ఇమిటేషన్ నగల షోరూమ్స్ హైదరాబాద్‌లో మాదిరిగా సిరిసిల్లలో వెలిశాయి. ధరలు కూడా రీజనేబుల్‌గా ఉంటున్నాయి. పండుగలు పెళ్లిళ్ల సీజన్‌లో ఇతర పట్టణాలకు వెళ్లకుండా ఇక్కడే కొంటున్నాం.

– వెలిచాల సంజన

తక్కువ ధరల్లోనే..



హైదరాబాద్, ముంబై, మచిలీపట్నం తదితర ప్రాంతాల నుంచి వస్తున్న వేలాది డిజైన్ల రోల్డ్‌గోల్డ్ నగలు ఆకట్టుకుంటున్నాయి. కొందరు వ్యాపారులు పెళ్లి సెట్స్‌తో పాటు భారీ డిజైన్లతో ఉండే నగలను అద్దెకు ఇస్తున్నారు.

– గాజంగి భవ్యసాయి

గ్యారంటీ ఇస్తున్నారు



ఇమిటేషన్ నగలు కొంటే బ్రాండెడ్ జువెల్లరీ తరహాలో లిమిటెడ్ పీరియడ్‌తో గ్యారంటీ ఇస్తున్నారు. బంగారు జువెల్లరీకి ఎక్కువ డబ్బులు వెచ్చించాలి. ఇమిటేషన్ నగలైతే తక్కువ ధరల్లోనే దొరుకుతున్నాయి. ఫంక్షన్లలో వీటి లుక్స్ అదుర్స్ అనిపిస్తున్నాయి.

–గజభీంకార్ సృజన

నేడు ఆధ్యాత్మిక కార్యక్రమాలు



మాట్లాడుతున్న ఇస్కాన్ ప్రతినిధి ప్రాణనాథ దాస

సిరిసిల్లటౌన్: తంగళ్లపల్లి మండలం నేరెళ్లలో ఆదివారం ఇస్కాన్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కృష్ణచైతన్య సంఘం ప్రతినిధి ప్రాణనాథ దాస తెలిపారు. శనివారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మేఘనాథ దాస, రాధాకృష్ణ దాస, అంబదాస, సుమంత్ దాస పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ల వితరణ



కంప్యూటర్లను ప్రారంభిస్తున్న ఎంఈవో రఘుపతి

కోనరావుపేట: మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాలకు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రూ.లక్ష విలువైన కంప్యూటర్లు, ప్రింటర్‌ను శనివారం అందజేశారు. విద్యార్థుల కోసం ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు బెస్ట్ రన్నర్స్ ఆర్గనైజేషన్ అనే ఎన్నారై సంస్థను సంప్రదించారు. దీనికి సానుకూలంగా స్పందించి 2 కంప్యూటర్లు, ప్రింటర్, 2 టేబుళ్లు అందించారు. ఎంఈవో దూస రఘుపతి ప్రారంభించారు. స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు ఆడెపు రాజేశం, ఉపాధ్యాయులు మల్లేశం, రాజేశం, విద్యార్థులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై ఆంజనేయులు

కోనరావుపేట: మండలంలోని మామిడిపల్లిలో కార్యదర్శిగా పనిచేస్తున్న అజీజ్ వారంరోజుల క్రితం సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు సీఈఐఆర్ ద్వారా గుర్తించారు. శనివారం అజీజ్‌కు ఎస్సై ఆంజనేయులు సెల్‌ఫోన్ అప్పగించారు.



కాముని దహనం

ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్ గ్రామంలో శనివారం రాత్రి కాముని దహన వేడుకలను నిర్వహించారు. గ్రామంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం ఎదుట గ్రామస్తులు భారీ సంఖ్యలో చేరుకొని కాముని దహనం కార్యక్రమం నిర్వహించారు.

పేదలకు ఆహార పొట్లాలు పంపిణీ



ఆహార పొట్లాలు అందిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయ పరిసరాల్లో ఉన్న పేదలకు పలువురు దాతల సహకారంతో మై వేములవాడ ట్రస్ట్ ప్రతినిధులు శనివారం వందమందికి ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. 1059 రోజులుగా ఈ కార్యక్రమం నిరంతరంగా కొనసాగుతుందని మధు మహేశ్, రఫీక్, రాజేందర్, పిన్నింటి హన్మండ్లు తెలిపారు. ఎవరైనా దాతలు అన్నదాన కార్యక్రమంలో భాగంగా 89855 88060 నంబర్‌కు ఫోన్‌పే లేదా గూగుల్ పే ద్వారా ఆర్థిక సాయం అందించాలని మధు మహేశ్ తెలిపారు.

భగత్‌సింగ్ వర్ధంతి



గంభీరావుపేట: మండలకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భగత్‌సింగ్ వర్ధంతి నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ పిట్ల దాసు, ఎన్ఎస్ఎస్ పీవో ధర్మపురి, టాస్క్ కో ఆర్డినేటర్ శ్రావణ్‌కుమార్, విజయ్, ఆంజనేయులు, వాణి, ఆదివిష్ణు, శ్రీనివాస్, భిక్షమయ్య, మనోహర్, కృష్ణప్రసాద్, మహేశ్, రాజేశ్, శైలజ, ఉమారాణి, శ్రావణి, రజిత, శిరీష తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: మండలంలోని కనగర్తిలో భగత్‌సింగ్ వర్ధంతి నిర్వహించారు. గ్రామంలోని చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భగత్‌సింగ్ పోరాట పటిమ గూర్చి ప్రజలకు వివరించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, నాయకులు బడే స్వామిదాస్, మారుపాక శంకర్, హన్మాండ్లు, రావులపెల్లి మీనయ్య, సగ్గు లచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



స్వామివారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



ఆలయంలో పూజలు చేస్తున్న ఆది శ్రీనివాస్, నాయకులు

• స్వామివారిని దర్శించుకున్న ప్రభుత్వ విప్ 'ఆది' పలువురు నాయకులు
• భారీగా తరలివచ్చిన భక్తజనం

చందుర్తి మండలంలోని బండపల్లి లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. గ్రామంతో పాటు కరీంనగర్, సిరిసిల్ల, వేములవాడ పట్టణ ప్రాంతాల భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. కాగా స్వామివారి పట్టు వస్త్రాలను కాసర్ల సురేశ్ రాజేశ్వర్‌రెడ్డి దంపతులు, ఆలయ కమిటీ చైర్మన్ దంపతులు గడ్డం నాగరాణి, లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచ్ దంపతులు గడ్డం పద్మ తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీటీసీ దంపతులు ముస్కు పద్మ మల్లారెడ్డి, తలంబ్రాలు, ఒడిబియ్యం సమర్పించారు. భక్తులకు మాజీసర్పంచ్ గడ్డం పద్మ తిరుపతిరెడ్డి దంపతులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు ఏనుగుల లచ్చిరెడ్డి, మాజీ సర్పంచ్ కటకం మల్లేశం, ఆలయ కమిటీ సలహాదారుడు గడ్డం తిరుపతి రెడ్డి వీడీసీ మాజీ అధ్యక్షుడు కటకం చంద్రయ్య, అంభాల దాసు, మల్యాల గంగనర్సయ్య, విక్రుర్తి శ్రీనివాస్ గౌడ్, తీపీరెడ్డి మనోహర్ రెడ్డి, తీపీరెడ్డి కరుణాకర్ రెడ్డి, కటకం రవి, గడ్డం సతీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రభుత్వ విప్ పూజలు

బండపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రభుత్వ విప్ , వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ శనివారం రాత్రి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ రాఘవరెడ్డి, వేములవాడ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు, సీనియర్ నాయకుడు ఏనుగు మనో హర్ రెడ్డి, ఎంపీపీ లావణ్య, జెడ్పీటీసీ సభ్యులు నాగం కుమార్, సెస్ డైరెక్టర్ శ్రీనివాస్ రావు, రుద్రంగి మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు అశోక్, ఏనుగుల శ్రీనివాస్, మార్కెట్ పార్టీ మండల అధ్యక్షుడు మ్యాకల ఎలయ్య, జెడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్, సనుగుల సింగిల్ విండో మాజీ చైర్మన్ ముస్కు ముకుందరెడ్డి, నాయకులు కొండ లక్ష్మణ్ గౌడ్, మల్యాల గంగనర్సయ్య, ఇస్మాయిల్, స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులను సన్మానించారు.



స్వామివారి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



వేములవాడ రూరల్ : కార్యక్రమంలో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు

గంభీరావుపేట: ప్రతిఒక్కరూ పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ గంభీరావుపేట, లింగన్నపేట సూపర్‌వైజర్లు సంతోషి, పద్మజ అన్నారు. పోషణ్ మాసోత్సవాల్లో భాగంగా శనివారం మండలకేంద్రంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్లు ప్రశాంతి, మమత, మంజుల, భాగ్యలక్ష్మి, రాధ, పద్మ, శ్వేత, సరోజన, శ్వేత, రాజమణి, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

వేములవాడరూరల్: చిరు ధాన్యాలతో ఆరోగ్యంగా ఉండవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మలాదేవి అన్నారు. మండలంలోని హన్మాజీపేట, బొల్లారం, లింగంపల్లి గ్రామాల్లో పోషకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలు, ప్రతి ఒక్కరూ చిరుధాన్యాలు తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు వాణిశ్రీ, అమృత, జూలీ, భారతి, హెల్త్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది డి.సుజాత, పి.విజయ, ప్రవళిక, చిన్నారుల తల్లిదండ్రులు, కిషోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండలకేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రేణుక హాజరై మాట్లాడారు. కొర్రలు, అరికెలు, జొన్న, సజ్జ, రాగి తదితర పోషకాలు తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి, నాగరాణి, తల్లులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ముందస్తు హోలీ వేడుకలు



గంభీరావుపేట: హోలీ వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో విద్యార్థులు శనివారం ముందస్తు హోలీ వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సన్నిధి వెంకటకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

గంభీరావుపేట: మండలంలోని లింగన్నపేట సాయి మోడల్ స్కూల్‌లో ముందస్తు హోలీ వేడుకలు నిర్వహించారు. ఒకరికొకరు రంగులు పూసుకొని ఆనందంగా గడిపారు.

'టీబీ'పై అవగాహన

బోయినపల్లి: ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని తడగొండ హెల్త్ సబ్‌సెంటర్‌లో ఏఎన్ఎం వసంత ఆధ్వర్యంలో టీబీపై శనివారం ప్రజలకు అవగాహన కల్పించారు. టీబీ ఎలా సోకుతుంది, తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలపై ప్రజలకు వివరించారు. అంగన్‌వాడీ టీచర్ రాజమణి, ఆశా కార్యకర్తలు అనసూయ, సునీత, తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు



బీఎస్‌రావును సన్మానిస్తున్న విద్యార్థులు

తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ, ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో శనివారం డాక్టర్ బీఎస్ రావు హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. దీంతోపాటు కళాశాల రూ.25 వేల విలువైన గ్రేవి మిషన్ అందజేశారు. అనంతరం డాక్టర్ బీఎస్‌రావును కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.రజని, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.